# సంక్షేమమే మా మ్యానిఫెస్టో

**వ్యవసాయానికే అత్యంత ప్రాధాన్యం.. మహిళా సాధికారతకు ప్రత్యేక కార్యాచరణ**
**రేపే ప్రజల ముందుకు మ్యానిఫెస్టో.. 55 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కన్నీళ్లే**
**డబ్బులుంటే హస్తం పార్టీలో టికెట్ పక్కా.. డబ్బు వెదజల్లి ప్రజల్ని కొనాలని చూస్తున్నది..**
**ఇప్పటికే కర్ణాటక నుంచి కొడంగల్‌కు 8 కోట్లు.. 40 చోట్ల అభ్యర్థుల్లేని పార్టీ 70 చోట్ల గెలుస్తదా?**
**పొన్నాల బీఆర్‌ఎస్‌లోకి వస్తానంటే నేనే ఆహ్వానిస్తా.. సీఎం కేసీఆర్ 100 సభల్లో పాల్గొంటారు**
**ప్రతి ఓటరు ఆడపిల్ల తండ్రిలా ఆలోచించాలి.. మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): రైతులు, వ్యవసాయాన్ని బలోపేతం చేసేలా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు ప్రకటించారు. మ్యానిఫెస్టోలో రైతులకే పెద్ద పీట వేస్తామని, మహిళల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో మీడియా ప్రతినిధులతో మంత్రి కేటీఆర్ చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు ప్రస్తావించిన అంశాలపై మాట్లాడుతూ.. బలహీన వర్గాలు, మైనార్టీలపై దృష్టిపెడతామని, ఆసరా పెన్షన్లు, బీడీ కార్మికులు, డయాలసిస్ రోగులు, ఒంటరి మహిళలకు లబ్ధి చేకూర్చే పథకాలు ఉంటాయని వివరించారు. ఇతర పార్టీల హామీలపైనా కేటీఆర్ స్పందించారు. నెత్తి వాడిది కాదు.. కత్తి వాడిది కాదు అన్నట్టు ఎటుపడితే అటు గోకుతున్నారని, ఎటుపడితే అటు గీకుతున్నారని ఎద్దేవా చేశారు.

### సంక్షోభం వచ్చినా సంక్షేమం ఆగలేదు

'మ్యానిఫెస్టో రూపకల్పనలో ఆదాయం, బడ్జెట్ వంటి అన్ని రకాల లెక్కలేసుకుంటున్నాం. ఇచ్చిన మాటను, హామీలను నిలబెట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇంతకాలం సంక్షోభం వచ్చినా సంక్షేమం ఆగకుండా జాగ్రత్తపడ్డాం' అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు, చచ్చేది లేదని అన్నారు. 2004, 2009లో ఆ పార్టీ మ్యానిఫెస్టోలు తీసుకొంటే వైఎస్సార్ ప్రభుత్వం రెండే రెండు హామీలిచ్చింది. 9 గంటల ఉచిత విద్యుత్తు సహా మరో హామీ. ఈ రెండింటినీ కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని తెలిపారు. ఇచ్చిన హామీలను విస్మరించటమే కాంగ్రెస్ ట్రాక్ రికార్డు అని వెల్లడించారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో 95% హామీలను నెరవేర్చామని చెప్పారు.

### బీజేపీ సింగిల్ డిజిట్ దాటకపోవచ్చు

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సింగిల్ డిజిట్ దాటకపోవచ్చని మంత్రి కేటీఆర్ జోస్యం చెప్పారు. ఆ పార్టీ 110 స్థానాల్లో డిపాజిట్ కోల్పోతుందని అన్నారు.

> "రాష్ట్రానికి బీఎల్ సంతోష్, అమిత్‌షా, ప్రధాని మోదీ ఎవరొచ్చినా చెప్పడానికి వారికేం లేదు. ఈ రాష్ట్రానికి, ఈ దేశానికి ఒక్క మంచి పని చేసిందేమీ లేదు. ఊరికే అరుపులు బొబ్బలు. మాట్లాడితే కేసులు, కేసీఆర్ ఫ్యామిలీ కరెప్టు ఇవి తప్ప వారు చెప్పేదాంట్లో కొత్తేముంది? తొమ్మిదిన్నరేండ్ల నుంచి పాత చింతకాయ పచ్చడి."
>
> \- మంత్రి కేటీఆర్

### 119 సీట్లపైనా ఫోకస్

రాష్ట్రంలోని 119 సీట్లపై తాము ఫోకస్ పెడతామని, ఏ సీటునూ వదలబోమని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. జీహెచ్‌ఎంసీతోపాటు సిరిసిల్ల, కామారెడ్డి ప్రచార బాధ్యతలను తాను నెత్తికెత్తుకున్నానని వెల్లడించారు. 'జీహెచ్‌ఎంసీలో రోడ్డుషోలు, కార్నర్ సభలు, డివిజన్ మీటింగ్స్ ఉంటాయి. సీఎం కేసీఆర్‌వి ఒకటో రెండో సభలు హైదరాబాద్‌లో ఉండొచ్చు' అని తెలిపారు. ఎన్నికలు రాజకీయ పార్టీలకు జీవన్మరణ సమస్యగా మారాయని, స్థిరమైన చిత్తంతో మంచి చేయాలనుకునేవారు ప్రజాజీవితంలో అన్నింటికీ సిద్ధంగా ఉండాలని అన్నారు. వ్యక్తిగతంగా తాను మద్యం, డబ్బు పంచకుండా గెలవాలని లక్ష్యం పెట్టుకున్నానని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ 114 మంది అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారని, మిగిలిన 5 మంది అభ్యర్థులను 3, 4 రోజుల్లో ప్రకటిస్తామని చెప్పారు.



శుక్రవారం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

### కాంగ్రెస్ మిగిల్చింది కన్నీళ్లే

ప్రజలకు కాంగ్రెస్ మిగిల్చింది కన్నీళ్లేనని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆ పార్టీ 60 ఏండ్లు మనల్ని ఆగం చేసిందని చెప్పారు. ఓ ఆడపిల్ల తండ్రి తన బిడ్డ పెండ్లి కోసం ఎంతలా ఆలోచిస్తాడో, తెలంగాణలోని ప్రతి ఓటరు కూడా కష్టపడి సాధించుకున్న తెలంగాణను ఎవరి చేతిలో పెడితే బాగుంటుందో ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణను ఎవరి చేతిలో పెట్టాలి? ఆ అభ్యర్థి గుణగణాలేమిటి? ఆ పార్టీ గుణగణాలేమిటి? ఎవరు ముఖ్యమంత్రిగా ఉండాలి? ఎవరు సారథ్యం వహిస్తే రాష్ట్రం బాగుంటది? అన్నది ఆలోచించాలి' అని కోరారు. సీఎం కేసీఆర్ పనితీరును ఆశీర్వదిద్దామా? ప్రతిపక్షాల మొసలి కన్నీళ్లకు మోసపోదామా? అని అడిగారు. 'కాంగ్రెస్‌కు 40 చోట్ల అభ్యర్థులు లేరు. అలాంటి పార్టీ 70-80 చోట్ల గెలుస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉన్నది. ఇది విని వాళ్ల పార్టీ కార్యకర్తలు కూడా నవ్వుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో గమనిస్తే కాంగ్రెస్‌కు 29 సీట్లకుగానూ 22-25 స్థానాల్లో అభ్యర్థులు లేరు' అని తెలిపారు.

> "దేశంలో కేసీఆర్ అంత పరుషంగా, పదునుగా మోదీని తూర్పారబట్టిన నేత మరొకరు లేరు. నిజంగా మేం బీజేపీకి సబ్ సర్వెంట్ అయితే 206 మైనార్టీ స్కూళ్లు పెట్టగలిగేవాళ్లమా? బీజేపీ మా ఫ్రెండ్ అయితే మైనార్టీల కోసం గొప్ప పనులు చేయగలిగేవాళ్లమా?"
>
> \- మంత్రి కేటీఆర్

### తెలంగాణ అభివృద్ధిని ఒక్క రాష్ట్రంలోనైనా చూపిస్తారా?

తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని కేటీఆర్ తెలిపారు. ప్రతి సూచీలో, నీతిఆయోగ్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు విడుదల చేసే ర్యాంకుల్లో తెలంగాణ అగ్రశ్రేణి రాష్ట్రంగా, ప్రగతిశీల రాష్ట్రంగా ప్రత్యేకతను చాటుకుంటున్నదని వెల్లడించారు. 'వైద్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పట్టణ, గ్రామీణ అభివృద్ధి.. ఇలా ఏ రంగాన్ని చూసినా అభివృద్ధే కనిపిస్తున్నది. తలసరి ఆదాయంలో తెలంగాణ నం.1 అని ఆర్బీఐ చెప్పింది. తెలంగాణ కాకుండా 27 రాష్ట్రాలు ఉన్నాయి. అక్కడ కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్నాయి. ఒక్క చోటైనా బాగుచేశారా? దేశంలో రైతులకు మేలు చేసే రాష్ట్రం ఏదన్నా ఉన్నదంటే అది తెలంగాణ మాత్రమే. కండ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం ఇది' అని వివరించారు.

> "ఈ నెల 28 వరకు సీఎం కేసీఆర్ పర్యటనలు ఖరారయ్యాయి. ఈ విడతలో సీఎం కేసీఆర్ 41 సభల్లో పాల్గొంటారు. ఆ తర్వాత కూడా కేసీఆర్ సభలుంటాయి. మొత్తం కలుపుకుంటే కేసీఆర్ హాజరయ్యేవి దాదాపు వంద సభలుంటాయి. అవసరాన్ని బట్టి నేను. మంత్రి హరీశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తాం. స్టార్ క్యాంపెయినర్ల జాబితా సిద్ధం అవుతున్నది. మంత్రులు, సీనియర్ లీడర్లు ప్రచారంలో పాల్గొంటారు."
>
> \- మంత్రి కేటీఆర్

### అబద్ధాల అమిత్‌షా

కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంతదారుణంగా అబద్ధాలు ఎలా చెప్తారో అర్థం కావడం లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలో రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గింది తెలంగాణలోనేనని కేంద్రమే చెప్తుంటే, అమిత్‌షా మాత్రం అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. మేఘాలయ సీఎంను మోస్ట్ కరప్ట్ అంటూ తిట్టిన ప్రధాని మోదీ.. నాలుగు రోజుల తర్వాత మళ్లీ మేఘాలయకు ఆ సీఎం ప్రమాణ స్వీకారానికి వెళ్లి, ఆ పార్టీతో పొత్తు కలుపుకొన్నారని విమర్శించారు. ప్రధాని కూడా పద్ధతి లేకుండా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.


### రాహుల్‌గాంధీ లీడర్

రజాకార్ సినిమా తెలంగాణ బీజేపీ ఎజెండా అని కేటీఆర్ తెలిపారు. 'ఓ గుజరాతీ తెలంగాణకు స్వాతంత్ర్యం కల్పించారు. ఇప్పుడు మరో గుజరాతీ వచ్చి మిమ్మల్ని మళ్లీ స్వతంత్రులను చేస్తాడు' అన్న మోదీ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'తెలంగాణ దాస్య శృంఖలాలను తెంచిది సీఎం కేసీఆర్ కాదా? తెలంగాణకు స్వేచ్ఛావాయువులను అందించి స్వయం పాలనలో సుపరిపాలన అందిస్తున్నది కేసీఆర్ కాదా?' అని అడిగారు. రాహుల్‌గాంధీ లీడర్ కాదు ఓ రీడర్ అని ఎద్దేవా చేశారు. ఇక్కడికి వచ్చి ఎవరో రాసిచ్చింది చదివి పోతారని విమర్శించారు.

### పొన్నాల వస్తానంటే నేనే ఆహ్వానిస్తా

కాంగ్రెస్ పార్టీకి పొన్నాల లక్ష్మయ్య రాజీనామాపై కేటీఆర్ స్పందిస్తూ 'పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్ సీనియర్ లీడర్. ఆయన్ను మేం గౌరవిస్తాం. ఆయన బీఆర్‌ఎస్‌లో చేరతానంటే రేపే నేను ఆయన ఇంటికి వెళ్లి ఆహ్వానిస్తా' అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌కు అత్యధిక సీట్లు వస్తాయన్న సర్వేలపై స్పందిస్తూ 'ఇవే సర్వేలు 2018లో మేం ఓడిపోతాయని చెప్పాయి. అప్పుడు, ఇప్పుడు.. ఇవే సర్వేలు, ఇవే ఏజెన్సీలు. వాళ్లే మళ్లీ మేం ఓడిపోతున్నామని చెప్పాయంటే మాకు శుభసూచకం. మళ్లీ మేమే గెలుస్తాం. వాళ్లే మళ్లీ పప్పులో కాలేశారు. రెండోసారి పప్పులో కాలేసిందునకు వారికి అభినందనలు' అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## లోకం పోకడ




ఎన్నికల కోసం మనం కూడా స్పెషల్ వాహనాలు ఏర్పాటు చేసుకోవాలి సార్!

## కర్ణాటక డబ్బును ముందే ఊహించాం

- **ఓటుకు నోటులో దొరికిన వ్యక్తి పీసీసీ అధ్యక్షుడు**
- **42 కోట్లు లభ్యమైన ఘటనపై స్పందించిన కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఓటర్లను కొనేందుకు కాంగ్రెస్ పార్టీ కర్ణాటక నుంచి రూ.వందల కోట్లు తెలంగాణకు పంపిస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు ఆరోపించారు. ఓటుకు నోటు కుంభకోణంలో లంచం ఇస్తూ కెమెరాకు చిక్కిన వ్యక్తి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న నేపథ్యంలో ఇలాంటివి ముందే ఊహించామని 'ఎక్స్'లో తెలిపారు. తెలంగాణలో స్కాంగ్రెస్‌కు నో చెప్పాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. కర్ణాటకలో ఐటీ అధికారులు శుక్రవారం రూ.42 కోట్లు పట్టుకున్న నేపథ్యంలో కేటీఆర్ పైవిధంగా స్పందించారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 38.2°c | 17.7°c |
| నల్లగొండ | 38.0°c | 22.0°c |
| రంగారెడ్డి | 37.4°c | 17.3°c |
| మహబూబ్‌నగర్ | 36.2°c | 20.0°c |
| మెదక్ | 34.9°c | 17.7°c |
| నిజామాబాద్ | 34.3°c | 22.2°c |
| ఖమ్మం | 34.0°c | 24.0°c |
| కరీంనగర్ | 34.0°c | 23.0°c |
| వరంగల్ | 34.0°c | 23.0°c |
| ~~హైదరాబాద్~~ | ~~33.2°c~~ | ~~21.2°c~~ |

# బీఆర్‌ఎస్‌దే హ్యాట్రిక్

## 2018 కన్నా ఎక్కువ సీట్లు గెలుస్తాం

- **కాంగ్రెస్‌లో ముగ్గురి మధ్య పదవుల పంపకం**
- **దానికి ఓ మీడియా అధిపతి సాక్ష్యం**
- **లోకేశ్ బాధను ఒక కొడుకుగా అర్థం చేసుకుంటా**
- **మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిలో మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ అధికారం చేపడుతుందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 2018 ఎన్నికల్లో 88 సీట్లతో రెండోసారి అధికారాన్ని చేపట్టినట్టే, ఈసారి అంతకన్నా ఎక్కువ సీట్లతో అధికారాన్ని చేపడతామని తేల్చి చెప్పారు. శుక్రవారం ప్రగతి భవన్‌లో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజల కోసం ఏమేం చేశామో చెప్పి, మళ్లీ అధికారం ఇస్తే ఏం చేస్తామో చెప్పి ఓట్లు అడుగుతామని అన్నారు. రాజకీయాల్లో తమను గెలిపించేది ప్రజలే కానీ, అధికారులు, అధికారాలు కావని స్పష్టం చేశారు. ప్రత్యర్థులు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని ఎత్తుగడలు వేసినా అందుకు తగిన వ్యూహ, ప్రతివ్యూహాలు అమలు చేస్తామని వెల్లడించారు. తమను నేరుగా ఎదుర్కోలేక, తమ గుర్తును పోలిన గుర్తులు, తమ అభ్యర్థుల పేరును పోలిన పేర్లు పెట్టి ప్రజలను అయోమయానికి గురిచేయాలన్న రాజకీయ భావదారిద్ర్యంతో కొన్ని పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ట్రక్, రోడ్డురోలర్ సహా కొన్ని గుర్తుల వల్ల తమకు గతంలో నష్టం జరిగిందని, ఎన్నికల కమిషన్ కారు గుర్తును పోలిన గుర్తులను తొలగిస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.

> "వచ్చే అసెంబ్లీ ఎన్నికలు ఒక ఎమ్మెల్యేను ఎన్నుకొనే ఎన్నికలు కావు. రాష్ట్రాన్ని నడిపించే సరైన నాయకుడిని ఎన్నుకొనే ఎన్నికలు. మా సీఎం కేసీఆర్. మళ్లీ మా సీఎం కేసీఆరే. సీఎంపై మా పార్టీకి స్పష్టత ఉన్నది. కాంగ్రెస్‌కు, బీజేపీకి సీఎం అభ్యర్థిపై స్పష్టత ఉన్నదా? తెలంగాణను పూర్తిస్థాయిలో అర్థం చేసుకోగల, కేసీఆర్‌తో సరిపోల్చగల నేత ఒక్కరైనా ఆ పార్టీల్లో ఉన్నారా?"
>
> \- మంత్రి కేటీఆర్



> "హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఇలా తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడైనా మతఘర్షణలు జరిగాయా తెలంగాణలో మసీదుల మీద, చర్చిల మీద దాడులు జరుగుతున్నాయా? బుల్డోజర్లు వచ్చి ఎక్కడైనా మైనారిటీల ఇండ్లు కూలుస్తున్నాయా? తొమ్మిదిన్నరేండ్లపాటు లౌకికవాదాన్ని పరిరక్షిస్తూ మనిషిని మనిషిగా చూస్తూ పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై మచ్చతేవటానికి ప్రయత్నిస్తున్న బీజేపీకి సరైన సమాధానం చెప్తాం. మాకు సొంతంగా ఎదగాలని ఉన్నది. మహారాష్ట్రలో పాగా వేయాలని ఉన్నది. బీఆర్‌ఎస్సే జాతీయ పార్టీగా అవతరిస్తున్నప్పుడు మాకు కాంగ్రెస్, బీజేపీతో కలవాల్సిన ఖర్మ ఏమిటి?"
>
> \- మంత్రి కేటీఆర్

### దాడులెవరిమీద?

'ఐటీ, సీబీఐ, ఈడీ దాడులు కాంగ్రెస్ నేతలపై ఎందుకు కావడం లేదు? బీఆర్‌ఎస్ నేతలపైనే ఎందుకు జరుగుతున్నాయి? పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి వసూళ్లు, దందాలు, భూదందాలు తెలియదా? జూబ్లీహిల్స్‌లో ఆయన ఇంటిచుట్టూ ఎన్ని కబ్జాలు, సొసైటీలో ఎన్ని కుంభకోణాలు చేస్తున్నాడో మోదీ, అమిత్‌షా సహా విచారణ సంస్థలకు తెలియదా? రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసును ఎందుకు విచారణకు స్వీకరించలేదు? కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని అనేక ఆధారాలున్నా విచారణ జరిగిందా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రతీకార దాడులతో పాలన సాగించాలన్నది బీఆర్‌ఎస్ లక్షణం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా కొన్ని యూట్యూబ్ చానళ్లు కేసీఆర్‌ను నోటికొచ్చిన బూతులు తిడుతున్నా సంయమనంతో వ్యవహరిస్తున్నామని చెప్పారు.

### ఎవరెక్కడి నుంచైనా పోటీ చేయొచ్చు

హుజూరాబాద్‌లో తామే గెలుస్తున్నామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'ఎన్నికల్లో ఎవరెక్కడినుంచైనా పోటీచేయొచ్చు. ఈటల రాజేందరే కాదు ఇంకెవరైనా, గజ్వేల్‌లోనే కాదు.. ఇంకెక్కడి నుంచైనా, ఎన్ని స్థానాల నుంచైనా పోటీ చేయొచ్చు. అందులో మాకున్న అభ్యంతరం ఏమిటి? బహుశా బీజేపీకి అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేకపోవడం వల్ల అలా నిర్ణయం తీసుకున్నారో' అని ఛలోక్తి విసిరారు. 'రాజేందరన్న ఇంకో 50 సీట్లలో పోటీచేయాలన్నా చేస్తారో ఏమో' అని అన్నారు. పొన్నాలతోపాటు మరికొంతమంది బీఆర్‌ఎస్‌లో చేరే అవకాశం ఉన్నదని కేటీఆర్ సూచనప్రాయంగా వెల్లడించారు.

### ఓ మీడియా అధిపతి సమక్షంలో ఒప్పందాలు

కాంగ్రెస్ పార్టీలో ఒక నాయకుడు అప్పుడే ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం అని ముహూర్తాలు పెట్టుకుంటున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎవరు మంత్రి? ఏ పోర్ట్‌ఫోలియో? ఎవరు ముఖ్యమంత్రి? అని పంపకాలు జరిగిపోయాయట అని అన్నారు. 'కాంగ్రెస్‌లో ముగ్గురు నాయకుల మధ్య పంపకాలు జరిగాయని చెప్పుకుంటున్నారు. ముగ్గురి మధ్య ఏడాదిన్నర చొప్పున పంపకాలు జరిగాయట. చివరి ఆరు నెలలు టాస్ సీఎం అట. ఈ ముగ్గురు నేతలు ఒక మీడియా అధిపతి సమక్షంలో ఒప్పందాలు చేసుకున్నారని తెలిసింది' అని తెలిపారు.

### ముదిరాజ్‌లు అంటే అపార గౌరవం

ముదిరాజ్ సామాజికవర్గం అంటే తమకు అపార గౌరవం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బండా ప్రకాశ్‌కు రాజ్యసభ సీటు ఇచ్చింది బీఆర్‌ఎస్ పార్టీ అని స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిపోయాక, ఆ సామాజిక వర్గం నుంచి బండా ప్రకాశ్‌ను ఎమ్మెల్సీ చేసి మండలి డిప్యూటీ చైర్మన్‌ను చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లకు 2 వేల సహకార సంఘాలను ఏర్పాటు చేసి, వారి అభ్యున్నతికి తోడ్పడ్డామని వివరించారు. భవిష్యత్తులోనూ వారికి అవకాశం కల్పించేది బీఆర్‌ఎస్సేనని తేల్చి చెప్పారు.

### లోకేశ్ ట్వీట్ చూసి బాధ అనిపించింది

ఏపీ మాజీ సీఎం చంద్రబాబు భద్రతకు ప్రమాదం ఉన్నట్టయితే రాజకీయాల్లో ఇది దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. చంద్రబాబు భద్రతపై లోకేశ్ చేసిన ట్వీట్‌పై కేటీఆర్ స్పందించారు. 'లోకేశ్ ట్వీట్ చూసి బాధ అనిపించింది. చంద్రబాబు భద్రత విషయంలో లోకేశ్ ఆందోళనను ఒక కొడుకుగా అర్థం చేసుకోగలను. లోకేశ్ చెప్పింది వాస్తవమైతే ఈ పరిస్థితి బాధాకరం. నాకు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నిజానిజాలు తెలియవు. కానీ చంద్రబాబు భద్రతకు ప్రమాదముంటే రాజకీయల్లో ఇది దురదృష్టకరం. రాజకీయాలు వేరైనా ఆయన కుటుంబం బాధను అర్థం చేసుకోగలను. వారికి నా సానుభూతి వ్యక్తం చేస్తున్నా. నిమ్స్ దవాఖానలో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షచేసిన సమయంలో ఆయన ఆరోగ్యంపై మేం కూడా చాలా ఆందోళన చెందాం. అప్పుడు రోశయ్య ముఖ్యమంత్రి. ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు నన్ను పక్కకు తీసుకెళ్లి మీరు పిచ్చోళ్లు.. ఢిల్లీలో ఎవరూ పట్టించుకోవటం లేదు. రేపు మీ ఫాదర్ బ్రెయిన్‌డెడ్ అయిపోతారు. ఆ తర్వాత 3, 4 రోజులకు చచ్చిపోతారు అని బెదిరించారు. నేను వినకపోతే ఒక లేడీ ఆఫీసర్ మా అమ్మను పక్కకు తీస్కపోయి అదే విషయం చెప్పారు' అని నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు.

> "హైదరాబాద్ తన గొప్ప సంస్కృతిని గణేశ్ నిమజ్జనం సాక్షిగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. గణేశ్ నిమజ్జనం ఉన్నదని మిలాద్-ఉన్-నబీ ర్యాలీని వాయిదా వేసుకున్నారు. ఇంత అద్భుతమైన సంస్కృతిని చాటి చెప్పిన ప్రదేశం దేశంలో మరోటి ఉన్నదా? వెలుగు దివ్వెగా హైదరాబాద్ లౌకికత్వానికి కొత్తదారి చూపిస్తున్నది."
>
> \- మంత్రి కేటీఆర్

> "మేం అమలు చేస్తున్న పథకాలను కాపీ కొట్టి వాటిని మ్యానిఫెస్టోగా ప్రకటించుకోవటం ఆ పార్టీ భావదారిద్ర్యానికి నిదర్శనం. ఆ పార్టీ కర్ణాటకలో చేసిన వాగ్దానాలను అమలు చేయలేక తలలు పట్టుకుంటున్నది. మూడునెలల్లో కర్ణాటకలో మ్యానిఫెస్టో అమలుచేయక విఫలమైన వారు తెలంగాణలో ఎలా సఫలం అవుతారు?"
>
> \- మంత్రి కేటీఆర్

## డబ్బుంటే కాంగ్రెస్ టికెట్

- **ఆ పార్టీలో నోట్ల కట్టలతో రాజకీయం**
- **మీడియాతో మంత్రి కేటీఆర్ చిట్‌చాట్**

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): 'ఎవరెక్కువ రేటు ఇస్తారు? ఎవరెక్కువ డబ్బు ఇస్తారు? ఇలా పద్ధతి ప్రకారం డబ్బులు తీసుకుంటూ కాంగ్రెస్‌లో టికెట్లు అమ్ముకుంటున్నారు' అని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన.. ఇటీవల తనను కలిసిన కాంగ్రెస్ నాయకుడు చెప్పిన విషయాన్ని మీడియా ప్రతినిధులతో పంచుకున్నారు. 'కూకట్‌పల్లిలో పోటీ చేయాలంటే రూ.15 కోట్లు ఇవ్వాలని ఓ కాంగ్రెస్ నేతను అడిగారు. దీనికి అదనంగా మరో రూ.10 కోట్లు ఖర్చు పెట్టుకోవాలని చెప్పారు. అది గెలిచే సీటు కాదు. ఇంతకుముందు పనిచేసిన సీటూ కాదు. కానీ ఆ ఆఫర్ ఇచ్చారు' అని తెలిపారు. అది సొంత ప్రాంతం కూడా కాదు కదా అని తాను అడగ్గా.. 'కాంగ్రెస్‌లో అవన్నీ ఉండవ్ సార్. డబ్బు ఇచ్చేస్తే కావాల్సిన సీటు ఇచ్చేస్తరు. పైగా ఒక ముఖ్యమైన స్థానం నుంచి పోటీచేస్తే నాకు గుర్తింపు వస్తుంది. అందుకే ఆశతో పోతున్నా' అని ఆ నేత తనతో అన్నట్టు కేటీఆర్ చెప్పారు. ఆ పార్టీలో నోట్ల కట్టలతో రాజకీయం చేస్తున్నారని తెలిపారు. 'కర్ణాటకలో కాంగ్రెస్ కలెక్షన్లను ప్రారంభించింది. మొన్నటివరకు అక్కడ ఉన్నది 40 శాతం కమీషన్ల ప్రభుత్వం అన్నారు. కానీ ఇప్పుడు 50 శాతం కమీషన్ గవర్నమెంట్ వచ్చింది. స్కాంగ్రెస్.. స్కాంలనిండా కూరుకుపోయింది. అక్కడ ప్రతి చదరపు అడుగుకు రూ.500 చార్జ్ చేస్తున్నారు. అక్కడ ఈ రోజు ఓ సామాన్య కార్పొరేటర్ ఇంట్లో(ఆ కార్పొరేట్ భర్త కాంగ్రెస్ పార్టీ నాయకుడు) రూ.42 కోట్లు దొరికాయి. మాకున్న సమాచారం మేరకు ఇందులో ఇప్పటికే రూ.8 కోట్లు కొడంగల్‌కు, రేవంత్‌రెడ్డికి చేరాయి. కాంగ్రెస్ పార్టీ అనేది ట్రైడ్, టెస్టెడ్, డస్టెడ్ పార్టీ' అని వెల్లడించారు.

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### పీఎంబీఐలో...

**ఫార్మాస్యూటికల్స్ & మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా (పీఎంబీఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 10
- పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీలు: అక్టోబర్ 19, 20
- వెబ్‌సైట్: www.janaushadhi.gov.in

### ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 4
- పోస్టులు: ప్రాజెక్ట్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసోసియేట్
- దరఖాస్తు: ఈ-మెయిల్ ద్వారా
- చివరితేదీ: అక్టోబర్ 26
- వెబ్‌సైట్: https://uohyd.ac.in

### అస్సాం రైఫిల్స్‌లో..

**అస్సాం రైఫిల్స్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 161
- పోస్టులు: పర్సనల్ అసిస్టెంట్, రిలీజియస్ టీచర్, ప్లంబర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 19
- వెబ్‌సైట్: https://www.assamrifles.gov.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఆధునిక చరిత్ర, కరెంట్ అఫైర్స్, హిస్టరీ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.